# "కథ కాదు"

యు. వెంకటరత్నం

వరిచేలో వంటరి తాడిచెట్టులా నిలబడ్డాడు నర్శిగాడు, సెంటర్లో. అక్కడో రిక్షా, అక్కడో రిక్షా కునికిపాట్లు పడుతున్నాయి.

"ఏరా నర్శిగా! ఇయాల పొద్దుటేలే బండేశావ్?" మరో రిక్షా పరమార్శ.

"అమ్మకు ఒంట్లో బాగుంటలా! అయ్య నాల్రోజుల క్రితం డూటీకెళ్ళాడు యింత వరకు రాలా! యింట్లో అన్నీ నిండుకున్నయ్. నేనేం చేయను. రిచ్చా తప్పితే మరో ఆదాయం లేకపాయె"

ప్రపంచం దృష్టిలో నర్శిగాడు పిల్లవాడే. ఓటు అమ్ముకోవటానికి యింకా హక్కురాని ఓసామాన్య మానవుడు.

"ఏయ్ రిక్షా వస్తావా!"

"అయ్"

"ఎంత పేట"

"రూపాయి యిప్పించదయ్యా!"

"అర్ధరూపాయికి వస్తేరా లేకుంటే లేదు."

"గిట్టదు బాబయ్యా. శానా ఎక్కుడు లాగాలి"

"వస్తావా లేదా"!

నర్శిగాడికి అమ్మ మందులకు కావల్సిన డబ్బులు జ్ఞాపకం వచ్చాయి

"సరే! రండయ్యా."

"ఏమోయ్! ముందరే కరెక్టుగా అడిగితే ఎంత బాగుండేది."

"లేదండి—అవసరం కదా!"

o o o o

శ్రీదేవి ఎ. సికి వస్తావా!

"వస్తానండి"

"ఏవోయ్. నీకెన్నేళ్ళు"

"పదిహేనండి"

"మరప్పుడే రిక్షా వేశావేం, అమ్మా, నాన్నా లేరా?"

"ఉన్నారండి. గడవక."

రోడ్ రోలర్ని వొంటి చేత్తో లాగుతున్నట్టుగా వుంది రిక్షా లాగుతుంటే.

శ్రీదేవి. ఎ. సి దగ్గర కొచ్చింది.

"సర్లే! ఎక్కుడు లావుంది. దిగుతానుండు."

"లాగుతాను బాబు—దిగకండి."

"పడిశావ్ లేవోయ్. యింద డబ్బులు తీసుకో."

"సార్. అక్కడ దాకా తొక్కుతానండి."

"వద్దులే వెళ్ళు,"

"సినిమా హాలుదగ్గరికి వచ్చేశాం బాబు."

o o o o

నర్శిగాడికి తన శారీరక శక్తి మీద ఆశ నశించింది. నిముషాలు, గంటలు, రోజులు—రాత్రి....పగలు, ఉదయం లేని రాత్రులు. కాలం, వయస్సు మనిషిని మృత్యువు దగ్గరికి తీసుకువెళ్తే మనిషిలో నిరాశ నిస్పృహ, మనిషి మనస్సుని మృత్యువుకు గురిచేస్తుంది. ఆపరిస్థితిలోనే వున్నాడు నర్శి.

మరలా అదే రిక్షా...అదే బాడుగ...అదే మనుష్యులు.

o o o

ఆ పూట నర్శిగాడి కళ్ళు ఆనందంగా మెరిశాయ్. అవును. మొన్న బండెక్కింది ఆయనే...మళ్ళీ వచ్చాడు.

"ఆ—నీపేరేంటి నర్శి కదూ! నీ మీద కథ రాశానోయ్ బహుమతి వచ్చింది యుంద యీ డబ్బుంచు."

నర్శి తన కళ్ళని నమ్మలేదు.

"అయ్యా! మా మీద కథ రాస్తే పత్రికలోళ్ళు, పుస్తకాలోళ్ళు బహుమతులు, డబ్బులిత్తారు గాని, మాలాంటోళ్ళకి బండి కొండానికి డబ్బెవరిత్తారు బాబు. సంతోసం బాబు—కతలు రాసే కొందరు రిచ్చా ఎక్కి ఐదు పైసల కాడ గంటన్నర బేరం ఆడతారు-సర్దాగా వుపన్నాసం ఇత్తారు, మళ్ళీ కత రాత్తారు. తమరు దీంతో మరోకత రాయండి సారూ"

నర్శిగాడి కళ్ళు నీరు తిరిగాయి.

తన బోటివాళ్ళ జీవితం కథ "కాలం" ఖర్చు అయ్యేందుకు కొంత మందికి ఉపయోగించింది అన్న తృప్తి మిగుల్చుకున్నాడు నర్శి ✳

# సానుభూతి

ఒక కవి తన స్నేహితుడైన ధనవంతుని దగ్గరకు వెళ్ళి ఇలా అడిగాడు— "ఒక ఐదు రూపాయలుంటే బదులివ్వండి ఇంట్లో బియ్యం లేవు. గోలగా వుంది" అడగలేక తడబడుతూ అడిగాడు.

"నా దగ్గర దమ్మిడీ లేదు. డబ్బెక్కడ్నించి వస్తుంది? నా దొడ్లో పండుతుందా. అదీగాక నేనెన్నిసార్లు ఇవ్వలేను" అన్నాడు ధనవంతుడు.

"నాకెప్పుడిచ్చారు"

"నువ్వు మరణించిన తర్వాత శిలా విగ్రహానికి ఇవ్వొద్దూ? ఇప్పుడూ ఇచ్చి అప్పుడూ ఇచ్చి నాకిదే పనా?" అన్నాడు ధనవంతుడు.

కవికి ఆరోజు రాత్రి కలలో కనిపించిన తన భార్య తిండిలేక ఒక ప్రక్కన పడుస్తూవుంటే ఒక ప్రక్కన శిలావిగ్రాహం తయారవుతూ వుంటుంది. ఆ శిలా విగ్రహానికి డబ్బిచ్చిన ధనవంతుని దాతృత్వాన్ని, రసహృదయాన్ని ప్రజలు వేనోళ్ళ కొనియాడుతూ వుంటారు.

గోపీచంద్